అప్పటికి మూడురోజులనుండి సరిగా రమణమ్మ కాహారములేదు. తొలిరోజున తానొక పూటనే తిని రెండవపూట మానివైచెను. "అమ్మా! నీ కాకలి లేదటే? బియ్యము పొయ్యలేదటే? రేపు నాకు చద్దియన్నమువద్దులే. నువ్వుతిను." అని యమాయికయగు సరస్వతి బ్రతిమాలగా నాపుణ్యగేహిని గుట్టుచెప్పక "నా కాకలిలేదు. కడుపు నొప్పిగావుం" దని యెట్లో ఆమెను సమాధాన పఱచెను. రెండవనాడు సరిగా తవ్వెడు బియ్యమున్నవి. తానుకూడ భుజించినచో సరస్వతి కొక్కపూట తిండియగును. ఆదిమండు వేసవి. పిల్ల తూలిపోవును. అట్టి సమయములో నామె యేమిచేయగలదు? ఎక్కడనైన బదులు తెచ్చుట కావారము రోజులనుండి యూరివారి నందరి విసిగించియేయున్నది. పైగా నభిమానవతి. ఇట్టి దీన స్థితిలో నాయాగర్భశ్రీమంతురా లిదివఱకెప్పుడు పడియుండలేదు. ఆయిల్లాలింకొకరి కింత పెట్టినదికాని ఒకరిని దేహియని యడిగి యెఱుగదు. శరభరాజంత త్వరలోవచ్చునని మాత్రమేమి నిర్ధారణము? అంతవఱకు మాడియుండవలసినదేనా? తల్లి తన బిడ్డకోసమెట్టి త్యాగమునైన చేయగలదు. అందుచే వ్రతమనిమిషపెట్టి, యామె నాడుకూడ నుపవాసముండెను.

ఇక తెల్లవారగనే మూడవరోజు. కొంచెము చలిదియన్నము మిగులగా సరస్వతికి పెట్టి రమణమ్మ తర్వాతగతి యేమని యోచించుచుండెను. తానెట్లైనను తాళగలదు. కాని పిల్ల మాటయెట్లు?

ముందునుగూర్చి యోచించిన కొలదిని, ఆమెకు నిరాశ మరింత బలముకాజొచ్చెను. కన్నులార జూచుచుండగనే తిండిలేక నాకలిచే తనముద్దు బిడ్డ చచ్చిపోవలసినదేనా? అయ్యో! యింక దిక్కులేదా? ఇట్లు తలపోయుచు నామె నూతిదగ్గర కూర్చుండి సరస్వతి చూడకుండ భోరున చంటిపిల్లవలె నేడ్చెను.

అంతలో నెవ్వరో పొరుగువారు వచ్చి తమ యింట జరుగబోవు విందునకు వారిని బిల్చిరి. రమణమ్మయు, సరస్వతియు కూడ వెళ్ళి భుజించిరి. కాని రమణమ్మ కాతిండి తిన్నట్లేలేదు. తనయింట నేమియు లేకుండుటయు, పిల్చినది తడవుగా తాముబోయి పరుల యింట తినవలసి వచ్చిన నాటి యీ హైన్యత మిక్కిలి యామెను బాధించెను. ఇకనాటి రాత్రిగడపవలసియున్నది. సరస్వతి ఆకలిగాలేదని నిద్రపోయినది. తిందుమన్నను రమణమ్మ కన్నములేదు.

అట్టి దుర్భరావస్థలో నుండి యారాత్రి రమణమ్మ భర్తకొఱ కెదురుచూచుచున్నది. అంతలో శరభరాజు ప్రత్యక్షమయ్యెను. మార్గాయాసఖిన్నుడగు నాయనకామె కాళ్లుకడిగికొనుటకు నీళ్లిచ్చి దాహమొసగెను.

శరభరాజు దీనవదనయైయున్న భార్యవంకజూచి మాటలాడలేకపోయెను. కన్నులలోనుండి చివ్వున నీరుగారినది. గంభీరహృదయుడగు నతడే యట్లయినపుడు రమణమ్మ సంగతి చెప్పవలెనా? అట్లు కొంతసేపటిదాక వారు మాట్లాడుకొనలేని స్థితిలో నడలజొచ్చిరి.

మరికొంతసేపటికి వారి దుఃఖోద్రేకము తగ్గినది. చివరకువారి వైఖరి యొక విధమగు బండతనము లోనికి దిగినది. అప్పుడు రమణమ్మ తనభర్త విఫలమనోరథుడై వచ్చుట గ్రహించి, అప్పటివఱకు తాననుభవించిన అవస్థనంతయు నెఱిగించి, ముందు గతియేమని యడిగెను. క్షణము శరభరాజు హృదయములో నుండి యొక్క దుఃఖ తరంగము దూసికొనిపోయి, శరీరమంతయు నూగించివైచినది. మరల నెట్లో స్థిమితుడై "నేను దేశమంతా గాలించి వెదికాను. మన దురదృష్టముచేత ఎక్కడా సంబంధం కుదరలేదు. నే నింత అన్నంతిని రెన్నాళ్లయింది. ఇట్టి సంకటావస్థలోపడి కుళ్లిపోవడం కంటె, ఒక్కమా రేవిషమో తిని కుటుంబమరణం పొందడంమేలని నిశ్చయించుకొని వచ్చా" నని చెప్పివికృతముగా చూడసాగెను. రమణమ్మ దృక్కులు పిల్లవైపు మరలినవి. తోడనే అచేతనయయి పడిపోయినది. శరభరాజు ప్రతిమవలె యట్లేయున్నాడు. ఎట్టి భయంకరపరిణామము రానున్నదో కాని, యాచంద్రికామయవినిర్మలాకాశము కూడ భయానకహాసినియై పోయినది.

## 3

ఏదియెట్లున్నను కాలచక్రమాగదు. తెల్లగా తెల్లవారినది. సూర్యోదయము కూడనయినది. సరస్వతి యొకచిన్న బిందెబూని కొలని యొడ్డునకు వచ్చినది.

ఆ కొలనియొడ్డున నొకయువకుడు ఇటునటు పచారుచేయుచుండెను. అత డందమైనవాడు. సౌమ్యునిగా నాతని చూచినంతనే తెలిసికొనవచ్చును. కాని మనస్సులో నేదియో యోచించుకొనుచున్నట్లగపడుచున్నాడు.

సరస్వతి కొలనులోదిగి పుక్కిలించుచు నిటునటు చూచుచుండెను. విచ్చిన తామరలతోను, నీళ్లపై మెఱయుచున్న సూర్యకిరణములతోను, ఆచెఱువు సొగసుగా నున్నది.

వాని కేమి బుద్ధిపుట్టెనో కాని, సరస్వతి సమీపముగా పోయి నిలువబడెను. ఆమె యాక్రొత్తవానివంక బెదురుచూపులు ప్రసరించెను. అప్పుడా యువకుడు "నువ్వెవరమ్మాయి" వని ప్రశ్నించెను.

సర—శరభరాజుగారి అమ్మాయిని.

యువ—నీపేరేమి ?

సర—(చిఱుసిగ్గుతో) సరస్వతి.

ఆయువకుని కానామాత్రమే లమృతసేచన మొనరించినవి కాబోలు నానందపరవశుడై నట్లుండి మరల "నువ్వు చదువుకొన్నావా?" అనియడిగెను. దానికి సరస్వతి "మానాన్నగారికి ప్రతిరోజు భాగవతము చదివి వినిపించడము నేనే" అని బదులుచెప్పినది.

ముద్దులు మూటగట్టుచున్న ఆస్వర్ణాంగిని యతడు కౌతుకముతో చూచుచున్నాడు. అతడు తన్నంతగా చూచుచుంటచే కాబోలు మనసరస్వతి యించుక తెల్లబోవుచు నీళ్లుముంచుకొని వెళ్లిపోవుచున్నది. తేలిపోవుచున్న మధురస్వప్నమువలె, నలలు వేయుచు నేగుచున్న స్వర్గీయసౌందర్యస్రవంతివలె భుజముమీద బిందెనెత్తుకొని పోవుచున్న సరస్వతి నత డట్లే చూచుచున్నాడు. ఆమె యచ్చోటు వాసినది.

అయువకుడు కూడ నచ్చోటువదలి పోవుచు మధ్యమధ్య నస్పష్టముగా "మన యూహలు వేఱు దైవసంకల్పము వేఱు. సహజసౌందర్యములో నెట్టి ప్రభావమున్నది" అనుకొనుచు వెడలిపోయెను.

## ర

మధ్యాహ్నమైనది. అప్పటికి శరభరాజెట్లో తేగలిగిన బియ్యముతో వంటచేసి రమణమ్మ తాము ముగ్గురొకేసారి తినవలయునని కాబోలు మూడు విస్తళ్లలోను వడ్డించినది.

ఆపుణ్యదంపతు లిరువురియందు నొకవిధమగు పైశాచికలక్షణ మావేశించినది. వైవర్ణ్యమునొందిన వారి మొగములును, వెఱ్ఱిచూపులును ఏదియో యుత్పాతమును సూచించుచున్నవి.

శరభరాజు పరిషించుటకు సిద్ధముగానున్నాడు. అంతలోనిరువురు క్రొత్తవారు తలవని తలంపుగా లోనికి వచ్చిరి. రమణమ్మయు, సరస్వతియు నావలకి వెళ్లిరి. శరభరాజు కొంచెము ఖంగారుపడి లేచి, "ఏమండోయి సోమసుందరంగారు, రండి దయచెయ్యండి. ఇదే నారావడ"మనెను.

ఆ వచ్చిన వారిలో రెండవవానిని మన మిందాక కొలనియొడ్డున జూచియున్నాము.

అప్పుడు శరభరాజు సోమసుందరము వైపుతిరిగి "మీ అబ్బాయి కేశవరావుకూడా వచ్చాడు. వెంకటాచలంగారింటికా? కాబోవు వియ్యాలవారు." అని సంభాషణ మారంభించెను.

సోమ—అక్కడికి కాదు. ఇప్పుడే కానున్న వియ్యంకుడుగారగు శరభరాజు బావగారింటికి.

శర—(కష్టముగా) ఆ అదృష్టము నాకుంటే, నేను క్రిందటి మారు మీయింటికి వరాన్వేషణకై వచ్చినప్పుడే ఒప్పుకొనేవారు. మీరు వేలకివేలు గ్రుమ్మరించే వారితో సంబంధము చేస్తారు కాని, మాబోంట్లతో చేస్తారా?

సోమ—మీరల్లా భావించవద్దు, జరిగిన విషయము చెపుతాను. అసలు మీరన్నట్లు వెంకటాచలంగారి కుమార్తెను చూచుకోవడానికే వచ్చాము. ఉదయం చెరువుకి వచ్చిన మీఅమ్మాయిని సరస్వతిని మావాడు చూచేడు. వెంటనే అతని అభిప్రాయాలు మారిపోయినవి కాబోలు. నాదగ్గరకువచ్చి "నాకు వెంకటాచలంగారి పిల్లవద్దు. శరభరాజుగారి పుత్రికయయిన సరస్వతే కావా"లని నిష్కర్షగా చెప్పేడు.

శర—అల్లా అయితే మీబోటివారితో సంబంధం చేయుటకంటె కావలసినదేముంది. కాని ఒకటి మాత్రము పీడిస్తోంది. మీరు వెంకటాచలంగారి సంబంధం కోసము వచ్చేరు. ఆయన నామీద నిష్ఠురములు వేస్తాడేమో?

కే—అది నాయిష్టముమీదే వున్నదికాదా?

సోమ—శరభరాజుగారూ! మన మేమి చేయగలము. వాని యిష్టమెట్లో అల్లే కానిమ్మని చెప్పేను. తల్లిలేని పిల్లవాడు. వాడికమనస్సు నేనెందుకు కష్టపెట్టాలి? అందుచేత అవశ్యము మన మిద్దరమూ వియ్యమందాలి.

కే—సహజసౌందర్యము, తగిన విద్యాకులశీలాదులు, అభిజాత్యముగల, బాలారత్నముకన్న పెన్నిధానము లేదు. అట్టివి కలలక్ష్మి కాబట్టియే నేను సరస్వతిని గృహలక్ష్మిగా వరించాను. ఈపాడుకట్నాలు రాగానే సత్కులప్రసూతలయిన యిట్టి కన్యారత్నము లెందరు మాటుపడియున్నారో? కన్యాప్రదాతయిచ్చు కన్యనా కాక వానిధనమునా చూడవలసినది?"అని అతడావడ్డించినవిస్తళ్ల వైపుజూచి, యాయన్నము వివర్ణముగానున్న దేమనెను. దానికి సత్యసంధుడగు శరభరాజు "ఇంకొకగడియదాక మీసంబంధము రాకున్నచో కుటుంబమరణ మొందెడివార" మని బదులుచెప్పెను. "అది విషాన్నమేనా?" యని వారిరువురు చకితులైపోయిరి.